క్లుప్తంగా

నేడు, రేపు మండల స్థాయి క్రీడా పోటీలు

చీమకుర్తి: మండల స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 20, 21వ తేదీల్లో బండ్లమూడి జిల్లా పరిషత్ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చీమకుర్తి మండల కన్వీనర్ బి.శేషగిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 విభాగంలో బాల బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 20న గేమ్స్, 21న అథ్లెటిక్స్ నిర్వహిస్తామన్నారు.

సంతనూతలపాడు మండలంలో..

21న సంతనూతలపాడు మండల స్థాయి క్రీడా పోటీలు స్థానిక స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో నిర్వహించనున్నట్లు హెచ్ఎం ఉమామహేశ్వరి, పీడీ శ్రీనివాసరెడ్డి, గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ మల్లికారాణి తెలిపారు. అండర్-14, 17 సంవత్సరాల విభాగంలో కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్, చెస్, యోగా వంటి పలు రకాల అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

21న పీవీఆర్ చౌదరి సంతాప సభ

ఒంగోలు టౌన్: ఇటీవల గుండెపోటుతో మరణించిన సీపీఐ నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి సంతాప సభ ఈ నెల 21తేదీన నిర్వహించనున్నట్లు సీపీఐ సీనియర్ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లయ్యలింగం భవనంలో జరిగే సంతాప సభలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు, సానుభూతిపరులు, వామపక్ష పార్టీల శ్రేణులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

పెయింటింగ్‌లో మహిళలకు శిక్షణ

చీమకుర్తి: ఎండ్లూరు డొంక వద్ద ఉన్న మహిళా ప్రాంగణంలో పెయింటింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచితంగా నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రాంగణం మేనేజర్ వై.అంజమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య మహిళలు తమ దరఖాస్తులను ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో పాటు పదో తరగతి జిరాక్స్ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు ప్రాంగణంలోని జిల్లా మేనేజర్ ఫోన్ నంబర్ 83339 21346 సంప్రదించాలని కోరారు.

స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఎంపికలు

కొత్తపట్నం: ఎస్‌జీఎఫ్ కొత్తపట్నం మండల స్థాయి అండర్ 14, అండర్ 17 బాయ్స్ అండ్ గర్ల్స్ టోర్నమెంట్ సెలక్షన్లు జరుగునున్నట్లు కొత్తపట్నం హైస్కూల్ పీడీ డి.సాయికిషోర్ గురువారం తెలిపారు. మండల స్థాయి టోర్నమెంట్.. సెలక్షన్స్ 20న అథ్లెటిక్స్, 21న కబడ్డీ, ఖోఖో, బ్యాట్‌మెంటిన్, చెస్, యోగా, వాలీబాల్ జరుగునున్నట్లు చెప్పారు. జిల్లా పరిషత్ గవర్నమెంట్ మున్సిపల్ ఎయిడెడ్ రికగ్నైటెడ్ ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. అండర్ 14 విభాగంలో 2011లోపు జన్మించి, అండర్ 17 కోసం 2008లోపు జన్మించి ఉండాలన్నారు. స్కూల్ ప్రధానోపాధ్యాయుల సంతకంతో ఫాంను తయారు చేసుకుని రావాలని కోరారు. పూర్తి సమాచారం కోసం 9177382350 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

వేద విద్య పూర్తి చేస్తే నిరుద్యోగ భృతి

ఒంగోలు మెట్రో: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో ప్రజాగళంలో తెలియజేసిన ప్రకారం రూ.3,000 నిరుద్యోగభృతి పొందుటకు వేద విద్య పూర్తి చేసిన నిరుద్యోగులు అర్హులు. ఏడు రోజుల్లోపు విద్య అర్హతల సర్టిఫికెట్లు అర్జీతో పాటు పూర్తి వివరాలతో సహాయ కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖకు పంపించవలసిందిగా సహాయ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి

బేస్తవారిపేట: భవన నిర్మాణ కార్మికులకు బోర్డు ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకుడు షేక్ అన్వర్ బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ జితేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కంభంలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని, జీఓ నంబర్ 1241 రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అమృతరాజు, గన్నవుడి అబ్రహం, డి.తిరుపతయ్య, రమణయ్య, దేవదానం పాల్గొన్నారు.

25న చెకుముకి సైన్స్ సంబరాలు

ఒంగోలు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ సహకారంతో ఈ నెల 25 నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు జేవీవీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండ్లా శ్రీనివాసులు, సీహెచ్ జయప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సంబరాలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు, సైన్సు పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఈ చెకుముకి పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. 25న జరగనున్న పాఠశాల స్థాయి చెకుముకి పరీక్షలో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా చూడాలన్నారు. పూర్తి వివరాలకు 9010649886, 8500232432 నంబర్లను సంప్రదించాలని కోరారు.

స్వచ్ఛతా హీ సేవపై అవగాహన అవసరం



క్రీడాకారులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వర రావు, పక్కన పీవీఆర్ ఉన్నత పాఠశాల హెచ్ఎం



డీఆర్ఆర్ఎం స్కూలులో వ్యాసరచన పోటీ పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

- విద్యార్థి దశ నుంచే పరిశుభ్రత, మొక్కల పెంపకం గురించి తెలుసుకోవాలి
- విద్యతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంపొందించాలి
- నగరంలోని మున్సిపల్ పాఠశాలల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల నిర్వహణ
- ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వర రావు వెల్లడి

ఒంగోలు సబర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లాలని ఒంగోలు నగర కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వర రావు అన్నారు. ఒంగోలు నగరంలోని మున్సిపల్ పాఠశాలల్లో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు వివిధరకాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను జాతి పిత మహాత్మా గాంధీ జయంతి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఒంగోలు నగరంలోని అన్ని మున్సిపల్ పాఠశాలల్లో అన్ని రకాల క్రీడలతో పాటు వ్యాస రచన, క్విజ్ పోటీలను నిర్వహించుతామన్నామని పేర్కొన్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం విజేతలైన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందిస్తామని వెల్లడించారు. పీవీఆర్ బాయ్స్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాధిక, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మనోహర రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాబ్జి, అధికారులు పాల్గొన్నారు.



పీవీఆర్ గ్రౌండ్‌లో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

రెడ్‌క్రాస్ నిధుల కొరత తీర్చేందుకు కృషి



రెడ్‌క్రాస్‌లో వైద్య పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు టౌన్: రెడ్ క్రాస్ నిధుల కొరతను అధిగమించేందుకు త్వరలో మెంబర్‌షిప్ డ్రైవ్ చేపట్టడంతో పాటు మైనింగ్ చెస్ నుంచి సీఎస్ఆర్ నిధుల కోసం చర్యలు తీసుకుంటానని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక కొత్త కూరగాయల మార్కెట్ వద్ద గల రెడ్ క్రాస్ నూతన బ్లడ్ సెంటర్‌ను రెడ్‌క్రాస్ చైర్మన్ హోదాలో గురువారం ఆమె సందర్శించారు. రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ ప్రకాశ్ బాబు, మేనేజింగ్ కమిటీ సభ్యులు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు సర్ హెన్రీ డోలాల్ట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్లడ్ సెంటర్ ఏర్పాటు చేయడానికి కమిటీ చేసిన కృషిని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. రెడ్‌క్రాస్‌లో మూడు కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన ఆధునిక పరికరాలను పరిశీలించారు. వైద్య పరికరాల పనితీరును మెడికల్ ఆఫీసర్, సిబ్బంది వివరించారు. బ్లడ్ బ్యాంకుకు వచ్చేందుకు మరో మార్గాన్ని ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు కోరగా, నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఆదేశాలిస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్టెప్ సీఈఓ లోకేశ్వరరావు, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, కోశాధికారి రాఘవ, మేనేజింగ్ కమిటీ సభ్యులు బీవీ రెడ్డి, కత్తి శ్రీనివాసరావు, శ్రీరాం రెడ్డి, ప్రసన్నరాజు, జనార్దన్, ఇక్బాల్ న్యామతుల్లాబాషా, పవన్, ఎం.సుబ్బారావు, మెడికల్ ఆఫీసర్ ఏఓ సుధాకర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సమాచార హక్కుపై అవగాహన



ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు, ఏఓ రమేష్‌తో రైతులు

మద్దిపాడు: మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఓ కె.రమేష్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై గురువారం మండల స్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు, ఏఓ రమేష్ మాట్లాడుతూ ప్రజలు సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం ప్రతి ఒక్క పౌరునికి ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగిన జరుగుతున్న విషయాల గురించి తెలుసుకునే హక్కు ఉందని, గతంలో ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగిన పనులు బయటకు తెలిసేవి కావన్నారు. ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని 2005లో ప్రవేశ పెట్టి ప్రజలకు సమాచారం తెలుసుకునే అవకాశం కల్పించిందని, ఈ చట్టం ఆధారంగా ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న, జరిగిన విషయాలను తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఏదైనా కార్యాలయంలో అవక తవకలు జరిగినా ఆ విషయం సమాచార హక్కు చట్టం ద్వారా బయటకు వస్తుందని, ఈ చట్టంతో అవినీతిపరులైన అధికారులు అవినీతికి పాల్పడకుండా అడ్డుకునే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఈ సమాచార హక్కు చట్టాన్ని దేశ సంక్షేమం కోసం ఉపయోగించాలని కోరారు. ఆయన వెంట ఏఈఓ శేషయ్య, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు

కొమరోలు: మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు 20వ తేదిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.కాశయ్య తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో అండర్-14, అండర్-17 బాలబాలికలకు 7 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ విభాగాల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కె.వి జయ్‌కుమార్‌కు పేర్లు అందజేయాలని సూచించారు.

రక్తదాన శిబిరం నిర్వహణ



రక్తదాన శిబిరంలో ఏఎస్పీ, బీజేపీ నాయకులు

ఒంగోలు సెంట్రల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు పువ్వాడి దామోదర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొమ్మి నరసింహారావు ఆధ్వర్యంలో ఇందిరా ప్రియదర్శిని లా కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. క్విస్, లా కళాశాల విద్యార్థులు, యువ మోర్చా నాయకులు శిబిరంలో రక్తదానం చేశారు. అడిషనల్ ఎస్పీ శ్రీధరరావు ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు పీవీ శివా రెడ్డి, డాక్టర్ సెల్ కార్యవర్గ సభ్యుడు కొమ్మి నరసింహారావు, జిల్లా ఇన్‌చార్జి రవి శంకర్, బాపట్ల జిల్లా ఇన్‌చార్జి క్రిష్టా రెడ్డి, ఒంగోలు నియోజక వర్గ ఇన్‌చార్జి వైసీ యోగయ్య యాదవ్, సురేష్, నాయక్, రాము, శ్రీనివాసరావు, రామక్రిష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పీడీ అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలి

ఒంగోలు: స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డి.జ్యోత్స్న దేవి అక్రమ సస్పెన్షన్‌ను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఓ.వీరారెడ్డి, డి.వీరాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు పాఠశాలకు వచ్చే క్రమంలో ఉపాధ్యాయిని మందలించారనే నెపంతో ఆమెపై అనేక అభియోగాలు మోపి , వ్యక్తిగత కక్షతో సస్పెన్షన్ చేయించడాన్ని ఉపాధ్యాయలోకం ఖండిస్తోందన్నారు. విద్యార్థినుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను బయటకు తీసి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థినులను పోటీపడే స్థాయికి తెచ్చి పాఠశాలకు అనేక బహుమతులు ఇచ్చిన ఘనత పీడీ జ్యోత్స్నదేవిదన్నారు. ఇదే పాఠశాలలో 13 సంవత్సరాలుగా పనిచేస్తూ విద్యార్థినులను తమ సొంత పిల్లలుగా భావిస్తూ విద్యార్థినుల ప్రేమాభిమానాలు పొందుతున్నారని, పాఠశాలలో జరిగే అన్ని కార్యక్రమాల్లో ముందుండి పాల్గొంటూ పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్నామని తెలిపారు. పాఠశాలలో 550 మంది విద్యార్థినులు ఉన్నారని, ఇంత మందికి లేని ఇబ్బంది ఇద్దరికే రావడాన్ని, 13 సంవత్సరాలుగా లేని అభియోగాలు ఇప్పుడే రావడాన్ని అధికారులు గమనించాలని కోరారు. సస్పెన్షన్‌ను వెంటనే రద్దుచేసి పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు



గాయపడిన దుర్గారావు

మార్కాపురం టౌన్: విద్యుదాఘాతానికి గురై వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం రాత్రి పట్టణంలోని కరెంటు ఆఫీసు వెనుక ప్రాంతంలో చోటుచేసుకుంది. పూలసుబ్బయ్య కాలనీలో నివాసముండే తాళ్ల దుర్గారావు బేల్దారి మేస్త్రీగా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం రాత్రి కరెంటు ఆఫీసు వెనుక ప్రాంతంలో ఇంటి పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మార్కాపురం జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు.

అడవిపంది దాడిలో మహిళల గాయాలు



గాయపడిన చెన్నమ్మ

బేస్తవారిపేట: ఉపాధి హామీ పనులు చేస్తుండగా అడవి పంది దాడి చేయడంతో మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన బేస్తవారిపేట మండలంలోని జెన్నివారిపల్లెలో గురువారం చోటుచేసుకుంది. పాలకూరి చెన్నమ్మ గ్రామస్తులతో కలిసి చెరువు సమీపంలో ఉపాధి హామీ పనులు చేస్తోంది. పక్కనే ఉన్న ముళ్లపొదల్లో నుంచి అడవి పంది ఒక్కసారిగా దాడిచేయడంతో చెన్నమ్మ ముఖంపై తీవ్ర గాయమైంది. క్షతగాత్రురాలిని తోటి కూలీలు మోటార్‌సైకిల్‌పై గలిజేరుగుళ్ల పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మార్కాపురానికి తీసుకెళ్లారు.

అర్బన్ మార్కెట్ ప్రారంభం

- మెప్మా మహిళల ఆధ్వర్యంలో..
- కొత్త కూరగాయల మార్కెట్ ఎదురుగా ఏర్పాటు
- ఉత్పత్తులు పరిశీలించిన కమిషనర్ వెంకటేశ్వరరావు



ఉత్పత్తులు పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర రావు

ఒంగోలు సబర్బన్: నగరంలో మెప్మా గ్రూపు మహిళలు ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఒంగోలు నగర కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వర రావు గురువారం ప్రారంభించారు. నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్‌కు ఎదురుగా మెప్మా స్వయం సహాయక సంఘాల మహిళల సుస్థిర జీవనోపాధుల ద్వారా నికరమైన ఆదాయ సముపార్జన, ఆర్థిక స్వావలంబన కోసం దీనిని నెలకొల్పారు. అనంతరం కమిషనర్.. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మెప్మా గ్రూపు మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించటంతో పాటు అమ్మకం కూడా చూపినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మెప్మా అర్బన్ మార్కెట్‌కు సరైన స్థలం కేటాయిస్తామని, నెలలో ఏ తేదీల్లో అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేయాలో కూడా నిర్ణయిస్తామని వెల్లడించారు. ముందస్తుగా ప్రచారం చేసి.. క్రమం తప్పకుండా కొనుగోలుదారులకు ప్రయోజనకరంగా ఉండేలా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. మహిళా ఉత్పత్తుదారులను కమిషనర్ అభినందించారు. మెప్మా పీడీ తేళ్ల రవికుమార్ మాట్లాడుతూ మేలు రకంగా అర్బన్ మార్కెట్ నిర్వహించే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. మహిళా ఉత్పత్తులకు విస్తృత స్థాయి మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు మెప్మా అర్బన్ మార్కెట్, ఈ మార్ట్, మహిళా మార్ట్ వంటివి నిర్వహిస్తామని వెల్లడించారు.

‘ఉపాధి’పై వెల్లువెత్తిన ఆరోపణలు

- కొనకనమిట్లలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక



ప్రజా వేదికలో మాట్లాడుతున్న పీడీ

కొనకనమిట్ల: మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో 2023-24 ఏడాదికిగాను చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. గురువారం కొనకనమిట్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ అర్జున్‌రావు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులపై డీఆర్పీల పర్యవేక్షణలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. మండలంలో 611 పనులకుగాను రూ.14.45 కోట్ల వరకు నిధులు ఖర్చు చేశారు. చెక్ డ్యాంలు, చెరువు, కుంటల్లో పూడికతీత పనులకు సంబంధించి కొలతల్లో తేడాలు ఉన్నాయని, జాబ్ కార్డులు సక్రమంగా పంపిణీ చేయలేదని ఫిర్యాదులు అందాయి. కాగా, డీఆర్‌పీల నివేదికకు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు చెప్పేవాటికి పొంతన లేదంటూ పీడీ అసంతృప్తి వ్యక్తం చేశారు. పీడీ మాట్లాడుతూ.. ప్రజా వేదికలో వెల్లడించిన అంశాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. డ్వామా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి, క్లస్టర్ ఏపీడీ నిర్మలా దేవి, వెంకటస్వామి, ఎస్ఆర్‌పీ మూర్తి, ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి, ఏపీఓలు బుల్లెన్నరావు, ఈసీ శ్రీనివాసరెడ్డి, వీఎస్ఏలు పాల్గొన్నారు.

నేడు అక్కినేని జయంతి వేడుకలు

ఒంగోలు మెట్రో: నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వర రావు జయంతి వేడుకలు 20వ తేదీ శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు అక్కినేని కళాపరిషత్ అధ్యక్షుడు కల్లగుంట కృష్ణయ్య తెలిపారు. ఉదయం 9 గంటలకు కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న అక్కినేని విగ్రహానికి క్షీరాభిషేకం, పూలమాలలు సమర్పించి నివాళులర్పిస్తామని తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు సీవీఎన్ రీడింగ్ రూం ఆవరణలో ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు వ్యాఖ్యానంలో అక్కినేని నాగేశ్వరావు గీతాలతో సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గాయకులుగా గణేష్ పాత్రో (విజయనగరం), బాలరాజు (నరసరావుపేట), హేమమాలిని (గుంటూరు), విజయ్, పూర్ణిమ (ఒంగోలు) పాల్గొని అక్కినేని చిత్రాల్లోని మధుర గీతాలు ఆలపిస్తారని తెలిపారు. సంగీత విభావరి అనంతరం అభిమానులకు అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్కినేని నాగేశ్వరావు జయంతి వేడుకల్లో ముఖ్య అతిథులుగా ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు తదితరులు పాల్గొంటారని అన్నారు. కనుక అక్కినేని జయంతి వేడుకలలో అయన అభిమానులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

చెకుముకి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

మార్కాపురం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్‌ను గురువారం జేవీవీ నాయకుడు ఏనుగుల రవికుమార్ ఆవిష్కరించారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులు సైన్స్ సంబరాలకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు చక్కిళం శ్రీధర్, జి.ముక్తేశ్వరరావు, ఒ.రామాంజనేయులు, శ్రీనివాసరెడ్డి, బాలయోగి, దుర్గా భవాని, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇసుక సరఫరా చేయాలి

ఒంగోలు అర్బన్: ప్రజలకు ఉచిత ఇసుకను పారదర్శకంగా సరఫరా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీ విధానంలో ప్రజలు ఇసుక బుక్ చేసుకునేందుకు రూపొందించిన వెబ్‌సైట్‌ను గురువారం వర్చువల్‌గా ముఖ్యమంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఒంగోలులోని ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రజలకు తక్కువ రేటుకు ఇసుక అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకొచ్చిందన్నారు. కేవలం రవాణా ఖర్చులు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో మైనింగ్ డీడీ జగన్నాథరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్విజ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కల్యాణి

ఒంగోలు: జాతీయ కోడింగ్ వారోత్సవాన్ని పురస్కరించుకుని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఒంగోలులో ప్రత్యేకంగా క్విజ్ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో డిగ్రీ విద్యార్థినులు సాంకేతిక పరిజ్ఞానంపై తమ అవగాహన మెరుగుపరచుకోవడానికి అద్భుతమైన అవకాశం కల్పించారు. గురువారం కళాశాల ఆవరణంలో ఉదయం 11 గంటలకు క్విజ్ పోటీలు ప్రారంభమయ్యాయి. విద్యార్థినులు గ్రూపులుగా పాల్గొని, టెక్నాలజీ, కోడింగ్, కంప్యూటర్ సైన్స్ అంశాలపై తమ ప్రతిభను కనబరిచారు. విజేతలకు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి యు.సరళ బహుమతులు అందించారు. జాతీయ కోడింగ్ వారోత్సవం ద్వారా విద్యార్థినుల్లో కోడింగ్ పట్ల ఆసక్తి పెంపొందించి, వారి సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. కళ్యాణి పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థినుల భవిష్యత్తుకు ప్రాధాన్యంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. యు.సరళ, వై.సుష్మ, ఏం.హేమ, వై. పావని, అధ్యాపక వర్గం సహకారాన్ని అందించారు.

జిల్లా విజన్ ప్లాన్ రూపొందించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, సీపీఓ వెంకటేశ్వర్లు

ఒంగోలు అర్బన్: జిల్లాలో మండలాల వారీగా విజన్ ప్లాన్ రూపొందించాలని చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ కలెక్టర్లకు సూచించారు. స్వర్ణాంధ్ర-2047పై గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ) డి.వెంకటేశ్వర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రైమరీ సెక్టార్, సర్వీస్, ఇండస్ట్రీ సెక్టార్లతో మండల విజన్ యాక్షన్ ప్లాన్ తయారుచేయాలన్నారు. విజన్ రూపొందించిన తర్వాత క్యూఆర్ కోడ్ వినియోగించి ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో సీపీఓలను నోడల్ అధికారులుగా నియమిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న అన్ని సెక్టార్లకు సంబంధించి జిల్లా అధికారులతో మూడు సార్లు వర్క్‌షాప్‌లు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు.